## ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్ప ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 27: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో స్వల్పంగా చేరుతోంది. శుక్రవారం ఇన్‌ఫ్లో 265 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 308 క్యూసెక్కులు నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 216 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 6.2 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

***తుంగభద్రడ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో..***

కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 9,066 క్యూసెక్కులు ఉంది. ప్రస్తుతం 36.120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1609.25 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## నవరాత్రోత్సవాల ఆదాయం రూ.30లక్షలు

అలంపూర్, అక్టోబర్ 27: అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి రూ.30,07,460 ఆదాయం వచ్చిందని ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.12,41,920, వివిధ ఆర్జిత సేవల టికెట్ల విక్రయం ద్వారా రూ.4,05,775, హోమం టికెట్ల ద్వారా రూ.2,83,000, అంతరాలయ దర్శనం టికెట్ల ద్వారా రూ.3,84,000, అన్నదాన సత్రానికి విరాళాలు రూ.2,73,408, ఇతరత్రా ఆదాయం రూ.4,19,357 సమకూరిందని వెల్లడించారు.

## మద్యం పట్టివేత: కేసు నమోదు



పట్టుబడిన మద్యంతో పోలీసులు

అలంపూర్,అక్టోబర్ 27: మున్సిపాలిటీ సమీపంలో హరిత టూరిజం హోటల్ వెనుక వైపు మండల పరిధిలోని కాశీపురం గ్రామం వెళ్లే రోడ్డుపై పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కర్నూలుకు చెందిన రథన్ కుమార్ అనే వ్యక్తి వద్ద రూ.28వేల విలువ గల మద్యాన్ని పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు.

## ఎమ్మెల్యే అబ్రహంకు బీఫారం రావాలి

అయిజ రూరల్, అక్టోబర్ 27: అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంకు బీఆర్ఎస్ పార్టీ బీఫారం రావాలని కోరుతూ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు, సర్పంచ్ సుజాత దంపతులు శుక్రవారం తిరుమలకు మెట్ల మార్గాన కాలినడకన వెళ్లారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకొన్నారు.



తిరుమలకు మెట్లమార్గాన కాలినడకతో వెళ్తున్న రాముడు

## నేడు ధన్వంతరి వేంకటేశ్వరుడి కల్యాణం

అయిజ, అక్టోబర్ 27: మండలంలోని ఉత్తనూరు గ్రామంలో కొలువైన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ పేర్కొంది. పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం శ్రీదేవి, భూదేవీ సమేత ధన్వంతరి వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ చేసి భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, బాజాభజంత్రీలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి కల్యాణం జరిపిస్తున్నట్లు తెలిపింది.

## పాఠశాలను పరిశీలించిన ఎస్సై

మానవపాడు, అక్టోబర్ 27: మండల కేంద్రంలో రెండ్రోజుల క్రితం అగ్నిప్రమాదం జరిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదిని ఎస్సై రాము శుక్రవారం పరిశీలించారు. ఘటన ఎలా జరిగి ఉంటుందని ఉపాధ్యాయులతో ఆరా తీశారు. గతంలో ఏమైనా సంఘటనలు జరిగాయా అని అడిగి తెలుసుకున్నారు.

# విద్యార్థులకు పోషకాహారం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉప సర్పంచు గోపాల్

రాజోళి, అక్టోబర్ 27: తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థులకు అల్పాహారం అందించే పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని రాజోళి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ (మెయిన్) పాఠశాలలో శుక్రవారం ఉపసర్పంచ్ గోపాల్ ఆధ్వర్యంలో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అరికట్టడమే లక్ష్యంగా సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరుగుతుందన్నారు. వారికి నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు మహర్షి వాల్మీకి జయంతి

అయిజ, అక్టోబర్ 27: బోయ కులంలో జన్మించి మహర్షిగా పరివర్తన చెందిన రత్నాకరుడు, లోకంలో రామాయణం ఆధారంగా ధర్మస్థాపన గావించి, శ్రీరామున్ని లోకోత్తర పురుషుడిగా చిత్రీకరించిన రామాయణ రచయిత మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వాల్మీకీబోయలు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అయిజ మున్సిపాలిటీతోపాటు ఉత్తనూరు, మేడికొండ, తూంకుంట, బింగిదొడ్డి, పులికల్ తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు.

## వాల్మీకి జయంతికి తరలిరండి

వడ్డేపల్లి, అక్టోబర్ 27: మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో శనివారం వాల్మీకి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వాల్మీకి ఐక్యకార్యాచరణ కమిటీ ప్రకటనలో కోరారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేత

- 11 ఇండ్లకు అనుమతితో 13 ఇండ్ల నిర్మాణం
- హైకోర్టు ఆదేశాలతో రెండిండ్లు కూల్చిన మున్సిపల్ అధికారులు

అయిజ, అక్టోబర్ 27: అయిజ పట్టణంలోని రాయిచూర్, కర్నూల్ చౌరస్తాలో అనుమతులు లేకుండా నిర్మించిన రెండిండ్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 11 ఇండ్లకు మున్సిపాలిటీ అనుమతులు తీసుకుని 13 ఇండ్లు నిర్మించారని స్థానికులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు అక్రమ కట్టడాలను కూల్చివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అనుమతితో శుక్రవారం ఉదయం 6:30 గంటలకే శాంతినగర్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కూల్చివేతను అడ్డుకుంటారనే కారణంతో ముందస్తుగా ఇండ్ల యజమానులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో జేసీబీతో ఇటుక గోడలను కూల్చివేశారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అనుమతితో ఇండ్లు కూల్చివేశామని కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. పట్టణంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, టీపీవో కుర్మయ్య, ఆర్ఐ మద్దిలేటి పాల్గొన్నారు.



కూల్చిన అక్రమ కట్టడం వద్ద అధికారులు

# కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

అయిజ, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర భద్రతా బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. శాంతినగర్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారులు, మేడికొండ, ఉప్పల గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర భద్రతా బలగాలను మోహరించామని సీఐ శివశంకర్ తెలిపారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్‌కుమార్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


## ఓటుహక్కు వినియోగించుకోవాలి

రాజోళి, అక్టోబర్ 27: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాజోళి ఎస్సై అబ్దుల్ ఖాదర్ అన్నారు. శుక్రవారం ఐటీబీపీ బలగాలతో రాజోళి మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల, ప్రజలు ఎన్నికల నిబంధనలను అత్రికమించవద్దని సూచించారు. రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, రాజోళిలో ప్రధాన విధుల గుండా ప్రత్యేక బలగాలతో కావాతు నిర్వహించారు.



రాజోళిలో ప్రత్యేక బలడాగాల కవాతు

## పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవ

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 27: ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో రాఘవ పరిశీలించారు. పాఠశాలలోని గదులు, విద్యుత్ సౌకర్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి రాధిక ఉన్నారు.

## ఓటుహక్కు నమోదు చేసుకోండి

ఇటిక్యాల అక్టోబర్ 27: అన్ని అర్హతలు ఉండి, ఇంకా ఓటు హక్కు నమోదు చేసుకోని యువతీ యువకులు ఈనెల 31వరకు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని తాసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. అక్టోబర్ 1, 2023 వరకు 18ఏండ్లు పూర్తిగా నిండిన వారు తమ ఫొటో, వయసు ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో గానీ, బీఎల్ఓల వద్దగానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం వారి దరఖాస్తును ఆమోదించడంగాని తిరస్కరించడం ఉంటుందని తెలిపారు.